విశాలాంధ్ర
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా

ఉగాది నాటికి జిల్లాలో 16 వేల ఇళ్లు గృహ ప్రవేశం: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఉగాది నాటికి జిల్లాలో మొత్తం 16 వేల ఇళ్లు నిర్మించి మెగా గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ చక్రధర్ బాబు అన్నారు. బుధవారం ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పమిడపాడు వద్ద, నెల్లూరుపాలెం వద్ద జగనన్న కాలనీలలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల పురోగతిని కలెక్టర్ చక్రధర్ బాబు పరిశీలించారు. తొలుత కలెక్టర్ పమిడపాడు వద్ద జగనన్న కాలనీలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ఈ లే అవుట్ లో మొత్తం 629 ఇళ్ల మంజూరు చేశారని, అందులో బిలో బేస్మెంట్ స్థాయిలో 243, బేస్మెంట్ స్థాయిలో 312, రూఫ్ లెవెల్ లో 41, రూఫ్ కాస్ట్ లో 8, పూర్తి అయినవి 25 గృహాలు ఉన్నాయని గృహనిర్మాణ శాఖ అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లి వివిధ దశల్లో వున్న ఇళ్ల నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధి కారులను, కలెక్టర్ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఎప్పటికప్పుడు స్టేజీ అప్డేషన్ చేయాలన్నారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకొని ఇళ్ల నిర్మా ణాలను త్వరగా పూర్తిచేయుటకు అధికారులందరూ సమన్వయంతో పని చేయా లని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ నెల్లూరుపాలెం వద్ద గల జగన న్న జగనన్న కాలనీలో చేపట్టిన ఇళ్ళ నిర్మాణాల పురోగతిని పరిశీలించి, ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ, పేదవానికి సొంత ఇంటి కలను సాకారం చేసే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గృహ నిర్మాణాలు చేపట్టిందన్నారు. నవరత్నాలు పేద లందరికీ ఇళ్లు పథకం కింద జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మొత్తం 69 వేల ఇళ్లు మంజూరు అయ్యా యన్నారు. ఈ ఉగాది నాటికి జిల్లాలో మొత్తం 16 వేల ఇళ్లు నిర్మించి మెగా గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. మండల, డివిజన్, నియోజక వర్గ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియ మించి, గృహ నిర్మాణాలను వేగవంతంగా నిర్మించేలా ప్రతి శనివారం డ్రైవ్ మోడ్ లో చర్యలు కృషిచేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 6 వేల ఇళ్లు పూర్తి అయి గృహప్రవేశాలకు సిద్దంగా వున్నాయని, మరో 4 వేల ఇల్లు రూఫ్ స్థాయిలో వున్నాయని అన్నారు. మరో 2 వేల ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ రోజు ఆత్మకూరు మునిసిపల్ పరిధిలోని జగనన్న కాలనీలో ఒకే రోజు 35 శ్లాబులు వేసేలా ఆర్డీఓ, మునిసిపల్ కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని కలెక్టర్ తెలిపారు. రోజుకి కనీసం 900 ఇళ్లు నిర్మించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఇళ్ల నిర్మాణా లను వేగవంతం చేస్తున్నామన్నారు. మన జిల్లాలో ప్రతి వారం 8 కోట్ల రూపాయలు బిల్స్ నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. స్వయం సహాయక సంఘంలో ఉన్న ప్రతి లబ్ధిదారునికి 35 వేల రూపాయల డ్వాక్రా రుణం ఇప్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు స్వయం సహాయక సంఘంలో ఉన్న 60 శాతం మంది గృహ నిర్మాణ లబ్ధిదారులకు రుణం ఇచ్చారని కలెక్టర్ తెలిపారు. ఇళ్ల నిర్మాణా లతో పాటు జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పి డి వెంకట దాసు, ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి, మునిసిపల్ కమిషనర్ రమేష్ బాబు, హౌసింగ్ శాఖ, విద్యుత్ శాఖ అధికారులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శులు క్రమశిక్షణతో మెలగాలి: కమిషనర్

విశాలాంధ్ర- నెల్లూరు కార్పొరేషన్: నగర పాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయ కార్యదర్శులు విధుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరిస్తూ క్రమశిక్షణగా మెలగాలని కమిషనర్ హరిత సూచించారు. స్థానిక 22/1 బి.వి నగర్, మదర్ తెరిసా వీధి వార్డు సచివాలయాన్ని కమిషనర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. ఆస్థి పన్ను, యూజర్ చార్జీల వసూళ్ళను సచివాలయ కార్యదర్శులు మరింత వేగవంతం చేయాలని సూచించారు. సచివాలయ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి క్షేత్ర స్థాయిలో సంక్షేమ పథకాలు అందేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. జగనన్న భూ హక్కు పథకంలో భాగంగా రీ సర్వే పనులను వెంటనే ప్రారంభించాలని కమిషనర్ ఆదేశించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

- మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి

విశాలాంధ్ర - కావలి: ఎమ్మెల్సీ అభ్యర్థులుగా వైసిపి తరపున పోటీ చేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నేటి శ్యాం ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి లను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని మునిసిపల్ ఫ్లాట్స్ లోని ఆయన నివాసంలో విలేఖరులతో మాట్లాడుతూ పార్టీకి వీర విధేయుడుగా, ఉన్నత విద్యావంతుడుగా, పారిశ్రామిక వేత్తగా, రాజకీయాల్లో అందరి మన్ననలు పొందిన శ్యాం ప్రసాద్ రెడ్డి చాలా మంచి వ్యక్తి అని అలాంటి వ్యక్తిని శాసన మండలి కి పంపాల్సిన బాధ్యత అందరి పై ఉన్నదన్నారు. నిరుద్యోగుల కష్టాలు, ఇతర సమస్యలపై పోరాటం చేయగల వ్యక్తి శ్యాం ప్రసాద్ రెడ్డి అని తెలిపారు. అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తేనే సమస్యలు పరిష్కరించడంలో విజయం సాధిస్తారని ఆయన అన్నారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సి అభ్యర్థి చంద్రశేఖర్ రెడ్డి కుడా రెడ్ క్రాస్ ద్వారా సేవా కార్యక్రమాల్లో చేస్తూ ఉన్నారని, ఉపాధ్యాయుల సమస్యల గళం ను వినిపించగలడని అలాంటి పోరాటం చేసే వ్యక్తిని గెలిపించుకోవాలని అన్నారు. ఉదయగిరి, కావలి నియోజకవర్గాల పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత గా వైసిపి అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

మంత్రి అప్పలరాజుకు ఆఫ్కాఫ్ చైర్మెన్ జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర -నెల్లూరు: రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ వృద్ధి, మత్స్య శాఖ మంత్రి సిదిరి అప్పలరాజు జన్మది న సందర్భంగా మంత్రి నివాసంలో రాష్ట్ర ఆఫ్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్ బాబు బొకే ఇచ్చి, జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఇచ్చిన తేనేటి విందులో పాల్గొ న్నారు. ఈ నేపథ్యంలో మత్స్య శాఖల అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి చెప్పినట్లు సమాచారం.

ఆదర్శనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్

విశాలాంధ్ర- నెల్లూరు కార్పొరేషన్: నేటి యువతకు ఆదర్శనీయుడు మూలాన అబు ల్ కలాం ఆజాద్ అని యువ న్యాయవాది, సేవ అవార్డు గ్రహీత ఇర్ల వెంకటరమణయ్య పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం కొత్తూరు టీచర్స్ కాలనీలో గురుస్తాన్ కోచింగ్ సెంటర్లో బుధవారం మూలాన అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ మహమ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇర్ల వెంకట రమణయ్య మాట్లా డుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరిం చారు. భారతదేశానికి మొట్ట మొదటి విద్యాశాఖ మంత్రిగా అబుల్ కలాం వ్యవహరించారని పేర్కొన్నారు. స్వతంత్ర సమర యోధుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులే ముసుగు వేసుకొని దాడి చేయడం దుర్మార్గం: టిడిపి

విశాలాంధ్ర - కావలి: టిడిపి అధికార ప్రతి నిధి పట్టాభిపై పోలీ సులే ముసుగు వేసు కొని దాడి చేయడం దుర్మార్గమని నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సుబ్బా నాయుడు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బా నాయుడు మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడవలసిన పోలీసులు, దుర్మార్గంగా వ్యవహరిం చటం దేశంలో ఎక్కడా లేదని మండిపడ్డారు. రైతుల పొలాలకు నీటి పారుదల సౌకర్యం కల్పించడం కోసం టిడిపి ప్రభుత్వం "నీరు-చెట్టు" పథకం కింద అనేక చెరువులు, కాలువలు అభివృద్ధి చేసిందన్నారు. పనులు చేసిన సాగునీటి సంఘాల అధ్యక్షులకు బిల్లులు వై.సి.పి ప్రభుత్వం నిలిపివే సిందన్నారు. టిడిపి నాయకులను ఆర్థికంగా నష్ట పరచడానికి బిల్లులు చెల్లించక పోవటం దుర్మార్గం అన్నారు. కోర్టుల జోక్యంతో బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి వస్తే బిల్లుల బకాయిల్లో 20 శాతం తగ్గించి తీసు కోమని కలెక్టర్ ద్వారా బెదిరిస్తున్నారన్నారు.ప్రభుత్వమే చట్ట వ్యతిరేకంగా పాలన చేస్తున్నదని, ప్రజాస్వామ్య వాదులందరూ దీన్ని ఖండించాలని పిలుపునిచ్చారు. పనులు చేసిన మా పార్టీ వాళ్ళే కాదు, మీ పార్టీ వాళ్ళు కుడా బిల్లులు రాక నీ సైకో మనస్తత్వానికి బలవుతున్నారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి మొగిలి కల్లయ్య, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పోతుగంటి అలేఖ్య, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ఏగురి చంద్రశేఖర్, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ఉప్పుటూరు బాల గురుస్వామి, రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి తటవర్తి వాసు, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి షేక్ మస్తాన్, అహ్మద్ రఫీ, దావులూరి దేవకుమార్, కోట రమేష్, పులి సుధాకర్, అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

రైతులకు అండగా వైసీపీ ప్రభుత్వం

-2024లో జగన్ సీఎం ఖాయం
-వెంకన్నపాలెం నాయకత్వంపై మంత్రి ప్రశంసలు

విశాలాంధ్ర- మనుబోలు: రైతులకు అండగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిలుస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మనుబోలు మండలం వెంకన్నపాలెం గ్రామంలో మంత్రి కాకాని బుధవారం రెండవ రోజు గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేశారు. తమ గ్రామానికి విచ్చేసిన మంత్రి కాకానికి వైసీపీ నాయకులు హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బాణాసంచా పూల వర్షం మేళ తాళాలతో అపూర్వ స్వాగతం పలికారు. ముందు ఆయన నూతనంగా నిర్మించిన సచివాలయం రైతు భరోసా కేంద్రాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్ ఆక్వా జోన్ ను ఆక్వా జోన్ గా చేసి ఒక్క రూపాయి 50 పైసలకు కరెంటు ఇస్తామని తెలిపారు. చంద్రబాబు హయాంలో రైతులు రోడ్డున పడ్డారని విమర్శించారు. ప్రస్తుత సంవత్సరం గిట్టుబాటు ధరకు పైగా ధాన్యం విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం గడపగడపకు తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బుర్రు మమత ,సర్పంచ్ తలారి పెంచలమ్మ ,మండల కన్వీనర్ హరి గోపాల్ రెడ్డి, మనుబోలు ఉప కడివేటి చంద్రశేఖర్ రెడ్డి, దాసరి భాస్కర్ గౌడ్, అడపాల శివకుమార్ రెడ్డి,ఎడం మల్లికార్జున్ రెడ్డి, సర్పంచ్ ఏడుకొండలు గుండాల ఆదినారాయణ, వాసిరెడ్డి రామిరెడ్డి, ఆవుల మనోహర్‌రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గం సోషల్ మీడియా కో కన్వీనర్ గుంజి రమేష్ ,అధికారులు ఎంపీడీవో వెంకటేశ్వర్లు ,హౌసింగ్ ఏ రవికుమార్ ,కార్తీ క్, విద్యుత్ఎఈ రవికుమార్, ఏపీవో ఏపీఎం అన్ని శాఖ అధికారులు వెంకన్నపాలెం హర్షవర్ధన్ యూత్ పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ ల జారీపై ప్రత్యేక దృష్టి సారించండి: కమిషనర్

విశాలాంధ్ర-నెల్లూరు కార్పొరేషన్: నగర పాలక సంస్థ జారీ చేసే ట్రేడ్ లైసెన్స్ ల ఆవశ్యకతపై వ్యాపార వర్గాలకు అవగాహన పెంచి, నగర వ్యాప్తంగా అన్ని షాపులకు లైసెన్సుల పరిధిలోకి తేవాలని కమిషనర్ హరిత శానిటేషన్ విభాగం అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ శానిటేషన్ విభాగం అధికారులు, సచివాలయం శానిటరీ కార్యదర్శులతో నగర పాలక సంస్థ ఆరోగ్యశాఖ పురోగతిపై సమీక్ష సమావేశాన్ని కమిషనర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్ర మంలో (క్లాప్) భాగంగా ప్రతీ ఇంటినుంచి ప్రణాళికాబద్ధంగా చెత్తను సేకరించాలని, యూజర్ చార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నగర వ్యాప్తంగా ఇంటింటి చెత్త సేకరణలో తడి, పొడి చెత్తను వేరు చేసి వాహనాలకు అందివ్వడంపై ప్రజలకు అవగాహన పెంచాలని సూచించారు. వేస్ట్ మేనేజ్మెంట్ కార్యక్రమంలో భాగంగా సేకరించిన చెత్తను అత్యంత పారదర్శకంగా అధునాతన పద్ధతిలో సేంద్రియ ఎరువులుగా మార్చి తిరిగి ప్రకృతిలో వినియోగించేలా పర్యవేక్షించాలని సూచించారు. సచివాలయాల వారీగా పన్నుల లక్ష్యాలను నిర్దేశించి, వసూళ్లను వేగవంతం చేయా లని కమిషనర్ ఆదేశించారు.పర్యావరణ హితం కోసం జాతీయ హరిత ట్రిబ్యునల్ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) సూచిం చిన మార్గదర్శకాలను నగర వ్యాప్తంగా అమలుచేసి ప్రతిఒక్కరూ పటిష్టంగా పాటించేలా అవగాహన కల్పించాలని, జాతీయ హరిత ట్రిబ్యునల్ సూచించిన మార్గదర్శకాలను అమలుచేసి నగరాన్ని ఆదర్శం గా తీర్చిదిద్దేందుకు శానిటరీ విభాగం సిబ్బంది కృషి చేయా లని కమిషనర్ ఆదేశించారు. డివిజనుల్లో దోమల వ్యాప్తి నిర్మూ లించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, మురుగు ప్రాంతా లను గుర్తించి పారిశుధ్య నిర్వహణ పనులను వెంటనే చేపట్టా లని సూచించారు. ఈ సమావేశంలో ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, శానిటరీ సూపర్ వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్ లు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కావలి: ఆర్.ఎస్.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం కావలి డిఎస్పీ వెంకట రమణ ను కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏబీవీపీ నగర సహాయ కార్యదర్శి నందీర్ మాట్లాడుతూ బోగోలు మండలం కడనూతలలోని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రదీప్ అనే విద్యార్థి రెండో సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్నాడని, ఈ కళాశాలకు చెందిన కొంతమంది విద్యార్థులు, బయట వ్యక్తులు ఆ విద్యార్థిని ర్యాగింగ్ చేసి అనేక విధాలుగా ఇబ్బంది పెట్టడంతో ఆ విద్యార్థి రైలు కింద పడి చనిపోవడం జరిగిం దన్నారు. ఈ ఘటన చాలా దురదృష్టకరమన్నారు. ఈ సంఘటన మొత్తానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహించిన కళాశాల యాజమాన్యం పై కూడా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

నెలాఖరు లోగా ఈ క్రాప్ చేయించు కోవాలి

విశాలాంధ్ర- కొండాపురం: మండలంలో ఏ గ్రామంలో అయినా ఏ పంట అయినా సాగు చేసిన రైతులు ఆ పంటను ఈ నెలాఖరు లోగా ఈ క్రాప్ చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రసూన అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు ఈ క్రాప్ నమోదు కు గడువు పెంచారని తెలిపారు. ప్రతి గ్రామంలోని సచివాలయంలో కానీ రైతు భరోసా కేంద్రంలో కానీ సిబ్బంది ఈ క్రాప్ నమోదు చేస్తారని తెలిపారు. ఇందువల్ల పంట నష్టం జరిగినప్పుడు పరిహారం పంపిణీ తో పాటు పలు రకాల ప్రయోజనాలు ఉంటాయని ఆమె తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వైద్యానికి ఆర్థిక సహాయం అందించండి

విశాలాంధ్ర - కావలి: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ కి చెందిన గుణ్ణంకొండ సాగర్, చామంతి ల ఏకైక కుమారుడు గుణ్ణంకొండ వినీత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వినీత్ డిగ్రీ మూడోవ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల కావలి నుండి బిట్రగుంటకు వెళుతుండగా కోవూరుపల్లి దగ్గర బర్రె హఠాత్తుగా రాగా గుద్దుకొని ప్రమాదానికి గురయ్యాడు. వెన్నుపూస విరగగా చెన్నైలోని విజయ హాస్పిటల్ లో చేర్పించి చికిత్సను అందించారు. కానీ నడుము నుండి అరికాలు వరకు స్పర్శను కోల్పోవటం జరిగింది. వారికి ఉన్న ఒక ఇల్లు కుదువ పెట్టి, ఉన్న బంగారం అమ్మి, కొంత అప్పులు చేసి రూ.24 లక్షలు ఖర్చు చేశారు. కానీ ఫలితం లేదు. ఇప్పుడు వినీత్ వీపు వెనుక భాగం పూర్తి గా దెబ్బతింది. ఇప్పుడు ఒక మంచి హాస్పిటల్ లో చూపించడానికి కావలసిన డబ్బులు లేక దాతల సహాయం కోరుతున్నారు. ఎవరైనా దాతలు ముందు కు వచ్చి సహాయం చేయాలని వినీత్ తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భారత్ జోడో యాత్రలో పాల్గొనటం అదృష్టం

- కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుంతూరు శ్రీనివాసులు

విశాలాంధ్ర - కావలి: రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో కావలి నుంచి కాశ్మీర్ వరకు సైకిల్ పై యాత్ర చేయటం నాకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని కావలి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుంతూరు శ్రీనివాసులు తెలిపారు. బుధవారం పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్ నందు ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రథసారది రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేయటం ద్వారా పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్నారు. విడిపోయిన ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా రావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ కాకుడదంటే కాంగ్రెస్ పార్టీ రావాలన్నారు. ఇవన్నీ ఆంధ్రప్రదేశ్ కు రావాలనే సంకల్పంతో కావలి నుంచి కాశ్మీర్ వరకు 2500 కిలోమీటర్లు సైకిల్ పై యాత్ర చేయటం, ఆ యాత్ర లో కాంగ్రెస్ పార్టీ ప్రముఖులను కలవటం చాలా ఆనందాన్ని ఇచ్చిందన్నారు. నా యాత్రకు సహాయ సహకారాలు అందించిన మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి కు ధన్యవాదాలు తెలిపారు. నేను చేపట్టే ప్రతి యాత్ర సమయంలో నన్ను ప్రోత్సహించిన అప్పల కళ్యాణ్ చక్రవర్తి, పసుపులేటి శ్రీనువాసులకు కృతజ్ఞతలు తెలిపారు. అలానే నా యాత్రకు సంపూర్ణ మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, జిల్లా అధ్యక్షుడు దేవకుమార్, కావలి నియోజకవర్గ ఇంచార్జ్ చింతాల వెంకట్రావు, పట్టణ అధ్యక్షులు అనుమాల శెట్టి వాసులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంబాష, మనుసూర్ పాల్గొన్నారు.

మౌలానా సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు అజీజ్ అహ్మద్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని పురస్కరించుకొని నెల్లూరు నగరం లోని ఆజాద్ సెంటర్ లో నేతలు ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు అజీజ్ అహ్మద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ సిరాజ్ మాట్లా డుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ గొప్ప విద్యావేత్త అని భారత తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేశారని, అనేక భాషల పై పట్టు కలిగిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చేవారు విద్య పరంగా ఆయన ఎన్నో మహోన్నతమైన సంస్కరణలు తీసుకొని వచ్చారు, ఆయన చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకొని ఆయన చూపిన మార్గంలో అందరూ నడవాల్సిన అవసరం ఉందని తెలి పా రు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సర్తాజ్, మున్నా, లతీఫ్, అహ్మద్ బాష, ఖాదర్ మొహిద్దిన్, అహ్మద్,వెల్ఫేర్ పార్టీ నాయకులు సుభాన్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ మా గ్రామంలో వద్దు

- పనులు అడ్డగించిన గ్రామస్తులు

విశాలాంధ్ర - ఉలవపాడు : మండల పరిధిలోని మన్నేటికోటలో విద్యుత్తు సబ్ స్టేషన్ నిర్మాణ పనులను దళితవాడ ప్రజలు అడ్డుకున్నారు. 132 కిలో వోల్టేజ్ సామర్థ్యం గల విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 2018 లో అనుమతించింది. 2019లో పనులు ప్రారంభమయ్యాయి. కొంత భాగం పనులు పూర్తయ్యాయి. అయితే కొంత కాలం తర్వాత తమ గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం వద్దంటూ దళితవాడ ప్రజలు అభ్యంతరం తెలిపారు. దీనిపై దళితవాడ ప్రజలు కొందరు హైకోర్టు కూడా వెళ్లారు. ప్రజలకు అనుకూలంగా తీర్పు రాలేదు. అయినా చాలా కాలంగా విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు తాత్కా లికంగా నిలిపివేశారు. మళ్లీ ఇన్నాళ్లకు బుధవారం అధికారులు పోలీస్ బందోబస్తు తో పనులు తిరిగి ప్రారంభించ డానికి ప్రయత్నించారు. కందుకూరు పోలీస్ డిఎస్ పి కండే శ్రీనివాస రావుతో పాటు ఇద్దరు సర్కిల్ ఇన్స్పెక్టర్లు పోలీస్ సిబ్బంది, మండల తహశీల్దార్ హుస్సేన్ భాష అక్కడికి వెళ్లారు. అయినా దళితవాడ ప్రజలు పనులను తిరిగి ప్రారంభించడానికి అంగీకరిం చలేదు. రెండు రోజులు సమయం కావాలని దళితవాడ ప్రజలు అధికా రులు చెప్పారు. సాయంత్రం వరకు ఈ గొడవ కొన సాగుతూనే ఉంది. ఇంకా అధికారులు గ్రామ ప్రజల మధ్య చర్చలు జరుగుతున్నాయి.

వైసీపీ అభ్యర్థి మేరీగను కలిసిన తెగచర్ల నాయకులు

విశాలాంధ్ర-రాపూరు:రాపూరు స్థానికులు, వైసిపి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్ సి అభ్యర్థి మేరీగ ముర ళీధర్ ను బుధవారం గూడూరు లోని అయన నివాసంలో తెగచ ర్ల గ్రామ వైఎస్ఆర్ సిపి నాయ కులు కొండయ్య యాదవ్, ఎంపి టిసి బుజ్జిరెడ్డి,పెంచలస్వామి తదితర నాయకులతో మేరిగ మురళీధర్ ను మర్యాద పూర్వ కంగా కలసి శాలువా కప్పిపూల మాలతో, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ముఖ్యమంత్రి ఆదేశిస్తే ఎక్కడ నుంచైనా పోటీకి సిద్ధం

- మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి

విశాలాంధ్ర - కావలి: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, వైసిపి అధిష్టా నం ఆదేశిస్తే నెల్లూరు జిల్లాలో ఎక్కడ నుండైన ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కావలి పట్టణంలోని వంటే రు నివాసం లో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వంటేరు మాట్లాడుతూ కావలి, ఉదయగిరి నియోజకవర్గాలు తనకు రెండు కళ్ళు అని అన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో అందరినీ కలుపు కుంటూ పార్టీ అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నానని అన్నారు. ఎలాంటి గ్రూపులు ఉదయగిరి నియోజక వర్గంలో లేవని, పార్టీలో ఎలాంటి విబేధాలు లేవన్నారు. ఉదయగిరి నుంచి టికెట్ ఆశిస్తున్నది వాస్తవమేనని స్పష్టం చేశారు. టికెట్ విషయంపై వైసీపీ అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్ళనున్నానని వివరించారు. కావలి నియోజక వర్గానికి ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. సమ్మర్ స్టోరేజ్ కోసం ఎంతగానో కృషి చేశామని, కావలి కెనాల్ ను ఆధునికరించడం జరిగిందన్నారు. రైతుబజార్ ను అభివృద్ధి చేశామని, క్రీడా మైదానం ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల ను అభివృద్ధి చేశామని అన్నారు. అలాగే నెల్లూరు ఎంపి అభ్యర్థిగా రెండు పర్యాయాలుగా పోటీ చేయడం జరిగిందని అన్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎక్కడా కూడా ఒక్క తప్పు చేయ లేదని తెలిపారు. నెల్లూరు జిల్లాలో వివాదరహితుడిగా ఉన్నా నని ప్రజలకు సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. వైసిపి పార్టీని అధికారంలోకి తీసు కొచ్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తానని అన్నారు.

భూహక్కు రీ సర్వే పనులు వేగవంతం చేయండి: కమిషనర్

విశాలాంధ్ర- నెల్లూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకం నిర్వహణలో భాగంగా నగర వ్యాప్తంగా రీ సర్వే పనులను వేగవంతం చేయాలని కమిషనర్ హరిత ఆదేశించారు. శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం నిర్వహణపై కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ లో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాలతో సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, రెవెన్యూ సెక్రెటరీలను సమన్వయపరచి రీ సర్వే పనులను పూర్తి చేయాలని సూచించారు. సచివాలయ కార్యదర్శులకు రోజువారీ రీ సర్వే లక్ష్యాలను నిర్దేశించి, లక్ష్యాలను అందుకునేల సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైన సమాచారం అందించడంలో వార్డు ప్లానింగ్ సెక్రెటరీలు, వార్డు రెవెన్యూ సెక్రటరీలు అడ్మిన్ కార్యదర్శులకు సహకరించేలా పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. నిర్దేశించిన గడువులోగా రీ సర్వే పనులను పూర్తి చేసి సమగ్ర సమాచారాన్ని ఆన్లైన్ లో పొందుపరచాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. నగర వ్యాప్తంగా ప్రతీ భవనాన్ని పన్ను పరిధిలోకి తీసుకొచ్చి, డిమాండ్ నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. నగర పాలక సంస్థ అద్దె షాపుల బకాయిలను పూర్తిగా వసూలు చేయాలని, బాకీ చెల్లించని వారిని షాపుల నుంచి వెంటనే ఖాళీ చేయించాలని సూచించారు. షాపుల అద్దెను క్రమం తప్పకుండా ప్రతీ నెలా వసూలు చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. నగర పాలక సంస్థ అద్దె షాపుల కేటాయింపులను ఆన్లైన్ లో అప్డేట్ చేసి వివరాలను ఎప్పటికప్పుడు పారదర్శకంగా ఉంచాలని, ఖాళీగా ఉన్న షాపులను గుర్తించి వెంటనే వేలము నిర్వహించి అద్దెకు ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న పారిశుధ్య నిర్వహణ పనుల యూజర్ చార్జీల వసూళ్ళపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. పన్ను వసూళ్ళలో సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు వారాంతపు లక్ష్యాలను నిర్దేశించాలని, లక్ష్యాలు పూర్తి చేయనివారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. రెవెన్యూ అధికారులంతా కార్పొరేషన్ ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని కమిషనర్ సూచించారు.ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

చెంగాలమ్మ దేవస్థానం మహాకుంబాభిషేకం

ప్రారంభ పూజల్లో వేమిరెడ్డి దంపతులు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: సూళ్లూరుపేట లో వెలసి ఉన్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం లో నూతన స్వర్ణ విమాన గోపుర శిఖర ప్రతిష్ట, మహా కుంభాభిషేకం మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభించారు, ఈ వేడుకల్లో ముందుగా అమ్మణ్ణికి ప్రత్యేక అభిషేకాలు చేశారు, పట్టు వస్త్రాల తో పుష్పాలతో అలంకారం చేశారు. ఈ వేడుకల ఉభయదాతలు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,ప్రశాంతి దంపతులు ఈ మహోత్సవాలలో పాల్గొన్నారు. బంగారు తాపడం తో సిద్ధం చేసిన శిఖర కలిశాలను ముందుగా ఆలయం లో ప్రదక్షణ చేసి అమ్మణ్ణి పాదాల చెంత ఉంచి పూజలు చేశారు, అనంతరం గణపతి పూజ చేసి మహోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భముగా ఆస్థాన మండపం లో ఏర్పాటు చేసిన లక్ష కుంకుమార్చన పూజలను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రారంభించారు. ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్ర రెడ్డి దంపతులు, ఈవో ఆళ్ళ శ్రీనివాసులు రెడ్డి దంపతులు లక్ష కుంకుమ పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ గోపురాల పై ప్రతిష్ట చేయనున్న 16 స్వర్ణ గోపుర శిఖర కలిశాలను పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం చేశారు. ఈ వేడుకల్లో ఆలయ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయండి

- అనుమోలు వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకొని వెళ్లి వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని జేసీఎస్ మండలకన్వీనర్ అనుమోలు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, కందుకూరి శాసన సభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి ఆదేశాలతో కొండసముద్రం సర్పంచ్ మన్నం వెంగమ్మ రమేష్ అధ్యక్షతన "మా నమ్మకం...నువ్వే జగన్ "కార్యక్రమంలో బాగంగా నూతనంగా నియమించబడిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన కార్యక్రమం బుధవారం మండలంలోని కొండసముద్రం గ్రామం లో నిర్వహించారు . ఈ కార్యక్రమానికి నూతనంగా నిర్మించబడిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు జేసీఎస్ కన్వీనర్అనుమోలు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం వారికి అందించిన సంక్షేమపథకాలను సవివరంగా వివరించి గత ప్రభుత్వానికి మనప్రభుత్వానికి వ్యత్యాసాన్ని వారికి వివరించాలని అన్నారు పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన కార్యక్రమం అని ప్రతి ఒక్కరు 2024 వ సంవత్సరంలో ముఖ్యమంత్రి గా జగన్మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యే గా మహీధర్ రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత గృహసారథులు కన్వీనర్లపైన ఉందని అన్నారు ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలు స్టిక్కర్లు అంటించి వారి నుంచి మంచి రెస్పాన్స్ వచ్చేటట్లు చూసి వారికి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాల్సినబాధ్యత మీ పై ఉందని అన్నారు ప్రభుత్వ పథకాలు రాని ఇంటికి ప్రభుత్వపథకాలు వచ్చేటట్లు చేసే బాధ్యత మీ మీద ఉంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాడు సర్పంచ్ వింజం వెంకటేశ్వర్లు, మన్నం వెంకటరమేష్, పరిటాల వీరాస్వామి, యాళ్ల శివకుమార్ రెడ్డి, నాగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి,వరికూటి సంజీవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హ్యాపీ సేవా సంస్థ ఆధ్వర్యం లో వీల్ చైర్ వితరణ

విశాలాంధ్ర - కావలి : పట్టణంలోని బాలకృష్ణారెడ్డి నగర్ 16వ వార్డుకు చెందిన మొగిలి నరసింహ అనే వ్యక్తి పుట్టుకతో దివ్యాంగుడు. మంచానికే పరిమితం అయిన విషయం తెలుసుకొన్న హ్యాపీ సేవా సంస్థ సభ్యులు తక్షణం గుప్తదాత సహకారంతో బుధవారం అతనికి వీల్ చైర్ అందించారు. ఈ సందర్భంగా హ్యాపీ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ ఘనీభాష మాట్లాడుతూ హ్యాపీ సేవా సంస్థ నిరుపేదలకు సాయం అందించేందుకు ఎల్లవేళలా ముందుంటుందన్నారు. గుప్తదాత కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపు తున్నా మన్నారు. దివ్యాంగులను ప్రతి ఒక్కరు ప్రేమించాలి, ఆదరించాలి, చేతనైన సాయం అందించాలన్నారు. తదుపరి వీల్ చైర్ తొ పాటు కొంత నగదు, పండ్లు, అందించారు. ఈ కార్యక్రమంలోహ్యాపీ సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు షేక్ ఖాదర్ బాషా, గౌరవ సలహా దారులు మొగల్ సిరాజ్ అహ్మద్ బేగ్, సంస్థ ఉపాధ్యక్షులు దేవరకొండ విజయ్, చేవూరి ప్రభయ్య, శివనారాయణ, జాగో సేవా సంస్థ అధ్యక్షులు షేక్ జమీర్, షేక్ సుభాని, మొగిలివనమ్మ, పాల్గొన్నారు.

వైసీపీ స్థానిక సంస్థల ఎంఎల్‌సి అభ్యర్థి మేరీగను కలిసిన రాపూరు మండల నాయకులు

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు స్థానికులు, వైసిపి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్ సి అభ్యర్థి మేరీగ మురళీధర్‌ను మంగళవారం గూడూరు లోని ఆయన నివాసంలో అయిన అప్పుడు రాపూరు మండల వైసిపి నాయకులు శ్రీకిరెడ్డి రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీకి రెడ్డి శశిధర్ రెడ్డి తో కలిసి రాపూరు మండలం సిద్దవరం గ్రామ వైసిపి నాయకులు ఎంపిటిసి పెంచలరెడ్డి, కోటూరు పాడు గ్రామ వైసిపి నాయకులు రమణారెడ్డి, సిద్దవరం గ్రామ వైసిపి నాయకులు రవి రెడ్డి, తదితర నాయకులతో మేరిగ మురళీధర్ ను మర్యాద పూర్వకంగా కలసి శాలువా కప్పి పూలమాలతో, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కొలతల ప్రకారమే వేతనాలు: ఏపీఓ

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: ఉపాధి హామీ పథకంలో కొలతల ప్రకారమే వేతనాలు ఉంటా యని ఏపీఓ సమీర్ బాషా అన్నారు. మండలంలోని చుండి గ్రామంలో జరిగే ఉపాధి హామీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగు తున్న తీరు గురించి కూలీలను అడిగి తెలుసుకొని కూలీలకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, కూలీలు వడదెబ్బ తగల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎండ తక్కువగా ఉన్న సమయంలోనే పనులు ముగించుకొని ఇంటికి వెళ్లాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేసుకొని ప్రభుత్వం నిర్ణయించిన కూలి పొందాలన్నారు. ఉపాధి పనులు నాణ్యతగా ఉండాలన్నారు. పనుల విషయంలో రాజీ పడవద్దని చూచించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ ఇరుపని వినయ్ ని ఆదేశించారు. జాబ్ కార్డు లేని వారికి జాబ్ కార్డు ఇప్పించాలన్నారు. ఉపాధి పనులలో ప్రతి కుటుంబం పాల్గొనేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా మస్టర్లను పరిశీలించి చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఇరుపని వినయ్, సీనియర్ మేట్ ఇరుపని క్రిష్టయ్య పాల్గొన్నారు.

ఆదాల నివాసంలో జనమే జనం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి నెల్లూరు రూరల్ నియోజక వర్గం బాధ్యతలను చేపట్టినప్పటి నుంచి ఆయన నివాసం సందడిగా మారింది. రూరల్ నియోజక వర్గం లోని అనేక ప్రాంతాల నుంచి స్థానిక నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఒక పరంపరగా తరలి వస్తూనే ఉన్నారు. అభినందనలు తెలపడం, సమస్యలు చెప్పుకోవడం కొనసాగుతూ ఉంది. బుధవారం ఆదాల నివా సంలో ఉదయం నుంచి సందడి చోటు చేసుకుంది. ఒకటో డివిజన్ నుంచి అధిక సంఖ్యలో స్థాని కులు తరలివచ్చారు. అంతకుముందే డిసిసి మాజీ అధ్యక్షులు ఆనం విజయకుమార్ రెడ్డి ఆదాల నివాసానికి వచ్చారు. హిజ్రాలు నాలుగో మైలు ప్రాంతం నుంచి వచ్చారు. తమకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల వారికి హామీనిస్తూ ఎక్కడంటే అక్కడ ఆక్రమణలు చేయవద్దని, అక్కడ ఖాళీ స్థలం ఉంటే తప్పకుండా కేటాయిస్తామని చెప్పారు. ఒకటో డివిజన్ నుంచి కార్పొరేటర్ నాగరాజు, గిరిజన నేత రవి ఆధ్వర్యంలో గిరిజనులు, మైనార్టీలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పెన్నా వారధి అంచున తరచూ ముంపునకు గురవుతున్నామని తెలిపారు. తమకు అక్కడ ఉన్న ఖాళీ స్థలాన్ని కేటా యించాలని కోరారు. అక్కడ ఉన్న స్థలమేమిటో పరిశీలించి తప్పకుండా చర్యలు తీసు కుంటామని ఎంపీ ఆదాల హామీ ఇచ్చారు. అంతకుముందు రూరల్ కార్పొరేటర్లతో ఆదాల ప్రభాకర్ రెడ్డి సమావేశమయ్యారు. వారి సమస్యల గురించి చర్చించి పరిష్కారాలు చెప్పారు. బుజబుజ నెల్లూరు నుంచి మాజీ ఎంపీటీసీ ఖాదర్ బాషా ఆధ్వర్యంలో పలువురు మైనార్టీలు తరలివచ్చారు. ఆదాల ప్రభాకర్ రెడ్డి నాయకత్వానికి మద్దతును తెలిపి సత్కరించి వెళ్లారు. "వి లవ్ యు" అనే స్వచ్ఛంద రక్తదాతల అంతర్జాతీయ సంస్థ సభ్యులు, ఎం కిషోర్ నేతృత్వంలో ఎంపీ ఆదాలను కలిశారు. ఆయనను సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి వారిని అభినందిస్తూ ఈ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా

విశాలాంధ్ర - నెల్లూరు: వరికుంటపాడు మండలంలో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. విరువూరు గ్రామ శివార్లలో జేసిబి టాక్టర్ల సహాయంతో గ్రావెల్ అక్రమ తవ్వకాలు గత కొద్ది రోజులుగా రాత్రి వేళల్లో కొన సాగుతున్నాయి. స్థానికులు గుర్తించి అర్ధరాత్రి వేళల్లో గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకున్నారు. పోలీసు, రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు నాలుగు టాక్టర్లు , ఒక జేసిబిని అదుపులోకి తీసుకుని స్టేషన్ కి తరలించారు.

మేరిగ నామినేషన్‌కి మండల నాయకులు

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు స్థానికులు నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల వైఎస్ఆర్ సిపి ఎమ్మెల్సీ అభ్యర్థి మేరిగ మురళీధర్ బుధవారం నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో నామి నేషన్ దాఖలు చేసిన సందర్భంగా రాపూ రు మండలం నుండి 21 పంచా యతీల నుండి గ్రామ గ్రామం నుండి నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు, ఆత్మీయులు, స్నేహితులు నామినేషన్ కార్యక్రమానికి వందలాది మంది రాపూరు మండల కార్యా లయం వద్ద నుండి సీనియర్ జిల్లా వైసీపీ నాయ కులు పాపకన్ను దయాకర్ రెడ్డి, రాపూరు మండలం జేసియస్ కన్వీనర్ దందోలు లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా జగన్మోహన్ రెడ్డికి జేజేలు పలు కుతూ మండ ల నాయకులు దుగ్గిరెడ్డి నరసింహారెడ్డి, ఎఎంసి వైస్ చైర్మన్ గంగిశెట్టి వెంకటేశ్వర్లు, బోద్దు మధుసూదన్ రెడ్డి, పుట్టంరెడ్డి కృష్ణారెడ్డి, దమ్మాయి రమణయ్య, మాదమాల పిచ్చి రెడ్డి, బొమ్మిరెడ్డి రమణా రెడ్డి, రేపూరి వరబాబు, మైనార్టీ నాయకులు డాక్టర్ ఖాదర్ బాషా, అబ్దుల్ గని, చిన్న సుబ్బయ్య, భూపతి జయరామయ్య, గెడ్డం వెంకట రమణారెడ్డి, దేవళ్ళ అంకయ్య, ఎల్లయ్య, తదితర నాయకులు, కార్యకర్తలు కోలాహలంగా రాపూరు నుండి కాన్వాయ్ ర్యాలీతో బయలుదేరి వెళ్లారు.

రైలు కిందపడి 108 టెక్నీషియన్ మృతి

విశాలాంధ్ర-మనుబోలు:మనుబోలు గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువు మూలకట్ట వద్ద మంగళవారం రాత్రి రైల్వే ట్రాక్ పై రైలు ఢీకొని చంద్ర కిరణ్ (36) మృతి చెందాడు. పిడూరు గ్రామానికి చెందిన ముద్దపాటి రాధయ్య, సుజాతమ్మల ఏకైక కుమారుడైన చంద్రకిరణ్ అవివాహితుడు. 108 అంబులెన్స్ వాహనంలో టెక్నీషియన్ గా విధులు నిర్వహిస్తున్నాడు. రైలు ప్రమాదమా లేక ఆత్మహత్య అనేది ఇంకా వివరాలు తెలియలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు కు తరలించిన రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎంతో సామ్యుడిగా పేరు తెచ్చుకున్న చంద్రకిరణ్ మరణ వార్త తెలియడంతో పిడూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

విశాలాంధ్ర-లింగసముద్రం :మండల పరిధిలోని అన్నేబోయినపల్లి గ్రామ మన్నేరు వాగు నుండి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ ను పక్కా సమాచారం అందుకున్న ఎస్సై ఆవుల వెంకటేశ్వ ర్లు సిబ్బందితో కలసి బుధవారం ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నే బోయిన పల్లె గ్రామ నుండి ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ఇదే క్రమంలో ప్రజలు ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే సమాచారం అందించాలని సమాచారం తెలిపిన వ్యక్తుల పేర్లు వ్యక్తుల వివరాలు రహస్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మేరిగ మురళీధర్ నామినేషన్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఉమ్మడి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి బుధవారం నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. వైసిపి అభ్యర్థిగా మేరిగ మురళీధర్ మూడు సెట్ల నామినేషన్ పత్రాలను కలెక్టరేట్లోని రిటర్నింగ్ అధికారి వారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి రోణంకి కూర్మనాథ్ కు అందజేశారు. పెళ్లకూరు మండలం బంగారం పేట సర్పంచ్ దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్ స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. వైసీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్ వెంట రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు, తిరుపతి పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి, గురుమూర్తి, జడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రంరెడ్డి లతోపాటు తిరుపతి నెల్లూరు జిల్లాలోని పలువురు వైసిపి కార్యకర్తలు మురళి అభిమానులు పాల్గొన్నారు. గతంలో ఇక్కడ నుండి టిడిపి తరపున వాకాటి నారాయణరెడ్డి పోటీ చేయగా ఆయనకు పోటీగా నాడు వైఎస్ఆర్సిపి అభ్యర్థిగా ఆనం జయకుమార్ రెడ్డి పోటీ చేశారు అయితే ఆ తదిరించడం జరిగిన పరిణామాలలో వాకాటినారాయణరెడ్డి నీ తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేయడం ఆయన బిజెపిలో చేరడంతో ఇప్పటి వరకు ఈ ఎమ్మెల్సీ స్థానం బిజెపి ఆధ్వర్యంలో ఉంది . అయితే నేటి వైసిపి అభ్యర్థి నామినేషన్ వేయటం ద్వారా ఈ స్థానం వైసిపికి ఏకగ్రీవమనే చెప్పవచ్చు. ఎందుకంటే జిల్లాలో ఉన్న స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులలో 98 శాతం వైసిపికి చెందిన వారు కావటం. నామినేషన్ల స్వీకరణకు గడువు నేటితో ముగియనుంది.

మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో జయభేరి ఖాయం

మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

విశాలాంధ్ర- నెల్లూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నెల్లూరు జిల్లా పరిధిలో ఉన్న మూడు స్థానాల్లో వైసీపీ విజయం సాధించడం ఖాయమని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని వైసీపీ కార్యాలయంలో వైసీపీ ముఖ్య నేతల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల అభ్యర్థిగా మేరీగా మురళిని ప్రకటించామని ఆ స్థానానికి సంబంధించి 98 శాతం ప్రజాప్రతి నిధుల బలం వైసీపీకి ఉందని ప్రతిపక్షాల నుంచి పోటీ ఉండబోదని ఆశిస్తున్నామన్నారు. ఏకగ్రీవంగా ఈ స్థానాన్ని కైవసం చేసుకోబోతున్నట్లు మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి తెలిపారు. రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి తో కలిసి నెల్లూరు వైసీపీ సమావేశంలో నిర్వహించిన మీడియా సమావేశం లో శాసన మండలి ఎన్నికల్లో ఎస్.సి, ఎస్టీ, బి.సిలకు ముఖ్యమంత్రి జగన్ అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామని, పట్టభద్రులు, టీచర్స్, ఎమ్మెల్సీ కి సంబంధించి గెలుపొందేందుకు ఎంఎల్ఏలు, ఇతర నేతలు కలిసి కట్టుగా పనిచేసేలా ప్రణాళికరూపొందించామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చక్కటి పరిపాలన ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి దోహదపడతాయన్నారు.

జనవాహిని మధ్య పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నామినేషన్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: చిత్తూరు కలెక్టరే ట్ లో తూర్పు రాయ ల సీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్ర శేఖ ర్ రెడ్డి నామినేషన్ కార్యక్రమం అశేష జన వాహిని మధ్య సందడిగా సాగింది. స్థానిక బస్టాండ్ సెంటర్ లోని స్వామి వివేకానంద విగ్రహా వద్ద నుంచి బారీ అనుచర గణం మధ్య ర్యాలీ సాగింది. అడుగడుగునా చంద్రశేఖర్ రెడ్డికి ఉపాధ్యా యులు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు. చంద్రశేఖర్ రెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ ముందు కు సాగారు. గాంధీ సర్కిల్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి చంద్రశేఖర్ రెడ్డి పూల మాలవేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన కలెక్టరేట్ కు చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా పలువురు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల నాయకులు, అభిమానులు, యువత చంద్రశేఖర్ రెడ్డికి అభినందనలు తెలిపారు. తొలుత నెల్లూరు నుంచి చంద్రశేఖర్ రెడ్డి నామినేషన్ ప్రారంభమైంది. జిల్లాకు చెందిన పలువు రు రాజకీయ ప్రముఖులు విద్యావేత్తలు అభిమానులు అత్యధిక సంఖ్యలో చిత్తూరుకు బయలు దేరి వెళ్లారు. అనంతరం చిత్తూరు లోని గాంధీ విగ్రహం నుండి నామినేషన్ వేసేందుకు బయలు దేరి వెళ్లారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్ అందజేత

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: మర్రిపాడు మండలం భీమవరం గ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులకు ఆత్మకూరు నియోజకవర్గ శాసన సభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.1.50 లక్షలను మంజూరు చేయించారు. బుధవారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ.1.50 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైనట్లు తెలిపే లేఖను వారికి అందచేశారు. వివరాల్లోకెళితే ఆత్మకూరు నియోజక వర్గం మర్రిపాడు మండలం భీమవరం గ్రామానికి చెందిన దగ్గుపాటి పెంచల ప్రసాద్ తన కుమారుడు దగ్గుపాటి పెంచల సాయి దీక్షిత్ అనారోగ్యంతో చెన్నైలోని రెయిన్ బో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్థోమ త లేని కారణంగా ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డిని కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందచేయాలని విన్నవించారు.స్పందించిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేయాలని సిఫార్సు చేసి రూ.1.50 లక్షలు మంజూరు అయ్యేలా కృషి చేశారుదీంతో బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ముందస్తుగా నిధులు మంజూరైన పత్రాన్ని ఆ కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి అందచేసి సాయిదీక్షిత్ ను జాగ్రత్తగా చూసుకోవాలని వారికి సూచించారు.

పంచాయతీ పనులపై విచారణ

విశాలాంధ్ర -ముత్తుకూరు: ముత్తుకూరు పంచాయతీ లో జరిగిన పనులు నాసిరకంగా ఉన్నాయంటూ జాతీయ కమిషన్ ఆఫ్ మైనారిటీకి స్థానిక వార్డు మెంబర్ షేక్ షఫీ ఉల్లా ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం పంచాయతీ కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులు విచారణ చేపట్టారు. ముత్తుకూరు పంచాయ తీలో జరిగిన సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం, సచివాలయాల నిర్మాణం వంటి పనులు చేయడంలో కాంట్రాక్టర్ కాకుటూర్ లక్ష్మణ రెడ్డి నాసిరకం మెటీరి యల్ వాడారని అందుకు అధికారులు కూడా సహక రించారంటూ దీనిపై విచారణ జరపాలని పంచాయతీ వార్డు మెంబర్ షేక్ షఫీ ఉల్లా నేషనల్ కమిషన్ ఆఫ్ మైనారిటీకి గతంలో ఫిర్యాదు చేశారు. దీంతో కమిషన్ నుండి ఆ పనులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక సమర్పించాలంటూ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు అందడంతో కలెక్టర్ చక్రధర్ బాబు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి చిరంజీవి, డి ఎల్ పి ఓ కృష్ణ, ఎండిఓ ప్రత్యూష స్థానిక పంచాయతీ కార్యాలయంలో వార్డు మెంబర్ల సమక్షంలో విచారణ చేపట్టారు. కాంట్రాక్టర్ కాకుటూరు లక్ష్మణ్ రెడ్డిని ఏ పనులు చేశారు. వాటిని మెటీరియల్ సక్రమంగా ఉందా? లేదా? అనే విషయాలపై పంచాయతీరాజ్ ఏఈ సురేష్ బాబును, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మునికుమార్ ను అధికారులు విచారించారు. వార్డు మెంబర్లను కూడా విచారించి వారు చెప్పిన ఫిర్యాదులను కూడా అధికారులు తీసుకున్నారు. అందరినీ విచారించాక తమ పూర్తి స్థాయి నివేదికను కలెక్టరుకు అందజేస్తామని విచారణ అధికారులు విలేక రులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి హేమంత్ కుమార్, సచివాలయ కన్వీనర్ చక్రం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మెడికల్ మాఫియా ఆగడాలను నియంత్రించాలి

ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ప్రజల రక్తాన్ని జలగల్లా తాగుతున్న మెడికల్ షాపు యాజమాన్యాలు మామూళ్ల మత్తులో ప్రభుత్వ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా అన్నారు. బుధవారం నెల్లూరు లోని రామకోటయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకూ మెడికల్ మాఫియా (ప్రయివేట్ మెడికల్ షాపుల) ఆగడాలు పెరిగిపోతున్నాయని, ప్రజల రక్తాన్ని మెడికల్ షాపు యాజ మాన్యాలు జలగల్లా తాగుతున్నా మెడికల్ మాఫియా ఆగడాలను అరికట్టాల్సిన రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి (డ్రగ్ కంట్రోల్ బోర్డు) అధికారులు మామూళ్ల మత్తులో పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తూ అమాయక ప్రజల ఆరోగ్యంతో ఆటలాడు కోవడం సరికాదన్నారు. రాష్ట్రంలో అనేక ప్రయివేటు హాస్పిటల్ యాజమాన్యాలు, ప్రభుత్వ డాక్టర్స్, మెడికల్ షాపుల యాజమాన్యాలు కలసి సిండికేట్ గా ఏర్పడి పెద్ద ఎత్తున నకిలీ మందులను, కాలం చెల్లిన మందులను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యం తో వ్యాపారం చేస్తున్నారన్నారు. అనేక ప్రయివేట్ క్లినిక్ డాక్టర్స్ ప్రభుత్వ నిబంధన లకు విరుద్ధంగా కొన్ని మందుల షాపుల్లో మాత్రమే కొనాలని ఒత్తిడి చేస్తున్నారని నిబంధనల ప్రకారం రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి డాక్టరు రాసే ప్రిస్క్రిప్షన్ లో జనరిక్ మందుల పేర్లతో అంటే మాలిక్యుల్ పేర్లను రాయాల్సి ఉండగా కేవలం ఎక్కువ కమీషన్ ఇచ్చే కొన్ని బ్రాండెడ్ మందులను డోస్ లకు మించి ఇస్తున్నారని పలు మెడికల్ షాపుల యాజమాన్యాలు బిల్లులు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని కంపెనీ వేరు మెడిసిన్ ఒకటి అంటూ నాసిరకం మందులను అమ్మడంతో పాటు పలు రకాల డిస్కౌంట్ ల పేరుతో పేద ప్రజలకు ఎర వేస్తున్నాయన్నారు. అనేక రకాల టెస్టులు పేరుతో ల్యాబ్ యాజమాన్యాలు పేదల రక్తాన్ని తాగుతుంటే అరికట్టవలసిన ఔషధ నియంత్రణ మండలి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మామూళ్ల మత్తులో తులుతూ పట్టీ పట్టనట్టు వ్యవహరిస్తూ ప్రజా ఆరోగ్యాన్ని గాలికి వదిలేసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు మేల్కొని వైద్య ఆరోగ్యశాఖలో జరుగుతున్న అవకతవకలు, మెడికల్ మాఫియా ఆగడాలు అరికట్టాలని తద్వారా రాష్ట్రంలో ప్రజా ఆరోగ్యానికి కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నెల్లూరు నగర నాయకులు గౌస్ ,సర్దార్, షేక్ మునీర్,ఫయాజ్ పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని పురస్కరించు కొని నెల్లూరు నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నేతలు ఆయన చిత్ర పటానికి ఘన నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి జాఫర్ షరీఫ్ మాట్లా డుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ గొప్ప విద్యావేత్త అని భారత తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేశారని, అనేక భాషల పై పట్టు కలిగిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. అనంతరం నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి సాబీర్ ఖాన్ మాట్లాడుతూ ఆయన విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చేవారని, విద్య పరంగా ఆయన ఎన్నో మహోన్నతమైన సంస్కరణలు తీసుకొని వచ్చారని, ఆయన చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకొని ఆయన చూపిన మార్గంలో అందరూ నడవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి హయాత్ బాబా, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఆసీఫ్ పాషా, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి నియామతుల్ల, నెల్లూరు నగర నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షుడు ఇక్బాల్, రసూల్, మునీర్, తాజు, మౌలానా అజీజ్, రబ్బాని పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నామినేషన్ లో నెల్లూరు ఎంపీ ఆదాల

విశాలాంధ్ర - నెల్లూరు సిటీ: స్థానిక సంస్థల వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా మేరీగ మురళి కలెక్టరేట్లో బుధవారం నామినే షన్ వేసిన కార్యక్రమంలో ఆదా ల ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. నెల్లూరు జడ్పీ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షుడు , ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి అభ్యర్థితో తోపాటు ఉన్నారు. మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, డిసిసిబి మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్ రెడ్డి, విజయ డైరీ చైర్మన్ రంగారెడ్డి, జడ్పిటిసి మల్లు సుధాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణ వెంకయ్య, వైసీపీ నేతలు జీవి ప్రసాద్, సుధాకర్ యాదవ్, అల్లా బక్షు, పాముల హరిప్రసాద్, నరసింహారావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎల్ సి రమణారెడ్డి నామినేషన్‌కు భారీగా తరలిన ఉపాధ్యాయులు

విశాలాంధ్ర- నెల్లూరు కార్పొరేషన్: ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన తూర్పు రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమణారెడ్డి బుధవారం చిత్తూరు లో నామినేషన్ దాఖలు చేశారు.ఎల్ సి రమణారెడ్డి నామినేషన్ దాఖలు కార్య క్రమానికి నెల్లూరు నుంచి ఉపాధ్యా యులు భారీగా తరలి వెళ్లారు. ఉపాధ్యా యులు స్వచ్ఛందంగా అంద రూ కలిసి ఒక వాహనం ఏర్పాటు చేసుకుని చిత్తూరుకు తరలి వెళ్లడం విశేషం. ప్రకాశం జిల్లా నుంచి కూడా ఉపాధ్యాయులు తొలుత నెల్లూరుకు వచ్చి అక్కడి నుంచి ఆ జిల్లా వాసులతో కలిసి చిత్తూరుకు తరలి వెళ్లారు. రెండు జిల్లాల కు చెందిన ఉపాధ్యాయులతో నెల్లూరు నగరం బుధవారం సందడిగా మారింది.

బాగా చదివి పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలి

విశాలాంధ్ర -కొండాపురం: మండలం పదవ తరగతి విద్యార్థులు బాగా చదువుకొని మంచి మార్కులు పొంది పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని మండలం లోని సాయి పేటలో ఉన్న శ్రీ దామ చిన బాబు మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ కలజులపాటి శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వం పదవ తరగతి విద్యార్థుల కోసం తయారు చేసిన విజయ దీపిక పుస్తకాలను స్థానిక ప్రధానోపాధ్యాయురాలు సులోచన దేవి తో కలిసి చైర్మన్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇంతవరకు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలతోపాటు విజయ దీపిక పుస్తకాలను కూడా చదువుకొని మంచి మార్కులు సంపాదించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సులోచ న దేవి , ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి గ్రస్తులకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర- రాపూరు: కుష్ఠువ్యా ధి గ్రస్తులకు సేవ చేయడం చా లా ఆనంద దాయకమని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నెల్లూ రు జిల్లా అధ్యక్షులు కొండా ప్రవీ ణ్ శంకర్ అన్నారు. రాపూరు మండలం లోని బోజ్జన పల్లి పం చాయతీ పరిధిలోని రాయిగుం ట గ్రామ పరిధిలోని లేప్రెసికాలని (బెల్ సైదా)కుష్ఠు వ్యాధి గ్రస్తులకు చీరలు, టవల్స్ పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా అధ్యక్షులు కొండా ప్రవీణ్ శంకర్ మాట్లాడుతూ ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ గోబల్ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు టి.జి. వెంకటేష్ 50 వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం రాపూరు మండలం లోని రాయిగుంటపల్లి గ్రామ పరిధి లోని (బెత్ సైదా, నజరత్) లెపుసీ కాలనీలో 35 మంది కుష్ఠువ్యాధి గ్రస్తులకు చీరలు, టవలు, లుంగీలు, బ్రెడ్స్ పంపీణీ చేశామని తెలిపారు. ఈ కార్య క్రమంలో ఆర్య వైశ్య నెల్లూరు జిల్లా అధ్యక్షులు కొండా ప్రవీణ్ శంకర్ తోపాటుకార్యదర్శి బి.సు రేష్, ఉపాధ్యక్షులు పి.రమేష్, జె.రవి కుమార్, వీరితోపాటు డి.పి.ఎం.ఓలు నరసింహులు, ప్రసాద్ ఆచారి, ఎం.మోహన్ రావులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్ రెడ్డికి పబ్లిసిటీ పిచ్చి

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

విశాలాంధ్ర- ముత్తుకూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి పబ్లిసిటీ పిచ్చి పట్టుకుందని అందువల్లే చారాన కోడికి బారాన మసాలా అన్న చందంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నాడని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. బుధవారం పంటపాలెం టిడిపి కార్యాలయంలో మండల అధ్యక్షులు పల్లం రెడ్డి రామ్మోహన్ రెడ్డి అధ్యక్షతన మండల స్థాయి పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఇంచార్జ్ శ్రీరామ్, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి కొన్ని పత్రికలను చూపిస్తూ ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న లా నేస్తం కింద 2011 మంది జూనియర్ లాయర్లకు కోటి 55 వేల రూపాయలను బటన్ నొక్కి వారి ఖాతాలకు జమ చేశార న్నారు. అయితే అందుకుగాను రెండు పేపర్లకు ప్రకటనలు కింద కోటి రూపాయలను చెల్లించారని తెలిపారు. ప్రజలు పనుల రూపంలో కట్టిన ధనాన్ని జగన్మోహన్ రెడ్డి తన పబ్లిసిటీ కోసం దుర్వినియోగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున రాష్ట్రంలోని అనేక మంది మేధావుల విగ్రహాలకు ముసుగులు వేసి ఉండగా, ముఖ్యమంత్రి తన ఫొటోలను వేసుకొని పేపర్లలో వేయడం విచారకరమన్నారు. ఎన్నికల కమిషన్ ఈ ప్రకటనలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పట్టభద్రుల నియోజకవర్గం టిడిపి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ కు యువకులైన, రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే వారు, రాష్ట్రంలో జరుగుతున్న అరాచక శక్తులను అరికట్టేందు కు, చదువుకున్న పట్టభద్రులు ప్రతి ఒక్కరు ఆలోచించి, అధికార పార్టీ భయాందోళనలకు గురి కాకుండా రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే యువత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలని ఆయన కోరారు. ముత్తుకూరు మండలంలో 1509 మంది ఎమ్మెల్సీ ఓటర్లు ఉన్నారని నాయ కులు వారి ఇంటి వద్దకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేప డుతున్న ప్రజా వ్యతిరేక విధా నాలను వివరించి వారు తమ ఓటును టిడిపి అభ్యర్థికి వేసేలా ప్రచారం నిర్వహిం చాలని కోరారు. నందమూరి తారకరత్న గుండెపోటు వల్ల చనిపోయాడని, అయితే వ్యవసాయ శాఖ మంత్రి దాన్ని నందమూరి వారి పార్టీ నారావారి కోసం అనే విధంగా వ్యంగంగా చమత్కరించడం సరికాదని ఆయన తెలిపారు. జగన్మోహన్ రెడ్డి చిన్నాన్న వైయస్ వివేకానంద రెడ్డినీ గొడ్డలితో చంపించిన వ్యక్తి తమ ముఖ్యమంత్రి అన్న విషయాన్ని కాకాని మరిచిపోవడం విచారకరమన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న స్థానికంగా ఉన్న వనరులను దోచుకునేందుకు రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో ఎక్కడ ఆయన పర్యటించడం లేదని, ప్రస్తుతం రాష్ట్ర ప్రజలకు అనేక జిల్లాల్లో వ్యవసాయ శాఖ మంత్రి ఎవరున్నారో కూడా తెలియదన్నారు. రైతులకు వ్యవసాయ పనిముట్లు కూడా ఇచ్చిన దాఖలాలు లేవని ఆయన తెలిపారు. రాష్ట్రంలో దుర్మార్గం పెచ్చు మీరి పోయిందని, పట్టపగలే పోలీసుల సమక్షంలో టిడిపి కార్యాలయం పై దాడి చేసి అనేక మందిని గాయపరిచిన వైసిపి నాయకులను కార్యకర్తలను వదిలేసి, బాధింపబడిన వారిపైనే పోలీసులు కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. సీసీ కెమెరాలు రికార్డు కావడంవల్లే బాధితులకు కొంత ఊరట కలిగి అవకాశం ఉందని ఆయన తెలిపారు. బానిసల్లా భయపడి బతకడం కంటే సైన్యంలో పనిచేసే రానున్న ఎన్నికల్లో గెలుపొందేందుకు కృషి చేద్దామని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో తానే సర్వేపల్లి అభ్యర్థిని ఆయన తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు కొత్తపల్లి రమేష్ కుమార్, ఆలూరు విష్ణువర్ధన్ రావు, నరసారెడ్డి, పల్లం రెడ్డి శ్రీధర్ రెడ్డి, శ్యాం ప్రసాద్ రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్ఫేశీ చట్టం 2002 కింద

ఇ-వేలం ప్రకటన

DCB BANK

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 9(1) కింద స్థిర ఆస్తి విక్రయం

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(6) తో చదివే సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 కింద డీసీబీ బ్యాంకునకు తాకట్టు చేయబడిన స్థిర ఆస్తుల విక్రయం కొరకు బహిరంగ ఇ-వేలం ప్రకటన. ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సహ-రుణగ్రహీతలు మరియు హామీదారు(లు)కు అధీకృత అధికారికి తెలియజేయునది ఏమనగా.. ఈ కింద పేర్కొన్న ఆస్తి డీసీబీ బ్యాంక్ లిమిటెడ్‌కు తాకట్టుపెట్టబడినది. సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 కింద ఈ ఆస్తిని బ్యాంకు యొక్క అధీకృత అధికారి లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకున్నారు. ఈ కింద పట్టికలో పొందుపరచిన వివరాల ప్రకారం ఈ కింద ప్రస్తావించిన బకాయిలు మరియు ఈ కింద పట్టికలో పొందుపరచిన వివరాల ప్రకారం భవిష్యత్తు వడ్డీ, చార్జీలు మరియు వ్యయం మొదలైనవాటిని తిరిగిరాబట్టుకునేందుకు ఈ కింద పేర్కొన్న ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించబడుచున్నది. ఈ ఆస్తి "ఎక్కడ ఎట్లా ఉన్నదో అట్లాగే" మరియు "ఉన్నది ఉన్నట్లు" మరియు "అక్కడ ఉన్నది ఏమైనా" షరతుపై ఆస్తి విక్రయించబడును.

రుణగ్రహీత(లు) మరియు (సహ-రుణగ్రహీత(లు): 1. శ్రీమతి కుదుముల రాధమ్మ (రుణగ్రహీత), 2. శ్రీ కుదుముల శ్రీనివాసులు (సహ-రుణగ్రహీత).

స్థిర ఆస్తి యొక్క వివరాలు: గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లా, ముత్తుకూరు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, వెంకటాచలం మండలం, పూడిపర్తి గ్రామపంచాయతీ, పూడిపర్తి గ్రామం,గ్రామకంటం సర్వే నం.321/1ఏ నందు 44.104 అంకణములు లేదా 352.832 చదరపు గజాల స్థలం. ఇందులో నిర్మించిన ఇల్లు వగైరా.

హామీఉన్న బాకీ వివరాలు	రిజర్వు ధర	ఇ-వేలం తేదీ& సమయం	ధరావత్తు సొమ్ము డిపాజిట్	తనిఖీతేదీ & సమయం
రూ.21,68,910/- (28.02.2022నాటికి)	రూ. 13,20,000/-	14.03.2023 న ఉ.11:30 నుంచి	రూ. 1,32,000/-	06.03.2023 (ఉ.11గం.నుంచి మ.4 గం.)
స్వాధీనత స్వభావం: భౌతికం				

వేలంలో పాల్గొనుటకు అభ్యర్థన లేఖ, కేవైసీ, పాన్‌కార్డ్, ఇఎండీ ప్రూఫ్‌తో పాటు ఇఎండీ సమర్పణకు చివరి తేదీ మరియు సమయం: 10 మార్చి 2023 న సాయంత్రం 5గంటల వరకు లేదా అంతకు ముందుగా. పద్మ.రాజు - 9885548845 & పి మురళీకృష్ణ - 8008123434

ఇఎండీ మొత్తాన్ని డీడీ/నెఫ్ట్/ఆర్టీజీఎస్ ఏదో ఒకటి ద్వారా డీసీబీ బ్యాంక్, ఎకౌంట్ పేరు - RAOU NON PDC, Account No.0272955100223. IFSC Code DCBL0000027, అబిడ్స్ బ్రాంచ్ - హైదరాబాద్ పేరిట డిపాజిట్ చేయవలసిందిగా ఉద్దేశిత కొనుగోలుదారులు/బిడ్డర్లను కోరడమైనది.

ఇ-వేలం యొక్క నిబంధనలు మరియు షరతులు క్రింది విధంగా:

1. ఇ-వేలం "ఎక్కడ ఎట్లా ఉన్నదో అట్లాగే" మరియు "అక్కడ ఉన్నది ఏమైనా" ప్రాతిపదికన "ఆన్‌లైన్‌లో నిర్వహించబడును. బ్యాంక్ ఆమోదించిన సర్వీస్ ప్రొవైడర్ ఎం/ఎస్. 4 క్లోజర్ ఇండియా ద్వారా వేలం నిర్వహించబడుతుంది. (సంప్రదింపు సంఖ్య...... వారి వెబ్ పోర్టల్ https://www.bankauctions.in. నందు) ఆన్‌లైన్ ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషన్, ఆన్‌లైన్ ఇవేలం విక్రయం యొక్క సాధారణ నియమ నిబంధనలను ని కలిగి ఉన్న ఇ-వేలం టెండర్ డాక్యుమెంట్ https://www.bankauctions.in నందు అందుబాటులో కలదు.
2. అధీకృత అధికారి యొక్క ఉత్తమ పరిజ్ఞానం మరియు సమాచారం మేరకు, ఆస్తి/లపై ఎటువంటి రుణం భారం లేదు. ఏది ఏమైనప్పటికీ, ఉద్దేశిత బిడ్డర్లు వారి బిడ్‌ను సమర్పించడానికి ముందుగానే వేలం వేయబడు ఆస్తి/లు యొక్క రుణభారం, టైటిల్ మరియు ఆస్తిపై ప్రభావం చూపు క్లెయిమ్‌లు/హక్కులు/ బకాయిలపై స్వంత స్వతంత్ర విచారణలు జరుపుకోవాలి. బ్యాంక్ యొక్క ఏదైనా నిబద్ధత లేదా ఏదైనా ప్రాతినిధ్యంగానీ వేలం ప్రకటన ఏర్పడదు. బ్యాంక్‌కు తెలిసినా లేదా తెలియకపోయినా ప్రస్తుతం ఉన్న మరియు భవిష్యత్తులో ఉన్న అన్ని భారాలతో ఆస్తి విక్రయించబడుతోంది. అధీకృత అధికారి / సెక్యూర్డ్ క్రెడిటార్ ఏదైనా థర్డ్ పార్టీ క్లెయిమ్‌లు/హక్కు/ బకాయిలకు ఏ విధంగానూ బాధ్యత వహించరు.
3. బిడ్ విజయవంతం కాకపోతే ఎటువంటి వడ్డీ లేకుండా ఇఎండీ తిరిగి చెల్లించబడుతుంది. ఎటువంటి కారణం చెప్పకుండానే ఏదైనా లేదా అన్ని ఆఫర్‌లను అంగీకరించే లేదా తిరస్కరించే లేదా వాయిదావేసే హక్కును దిగువ సంతకందారు కలిగి ఉంటారు. ఆఫర్ అంగీకరించబడితే, కొనుగోలుదారు వేలం రోజున వెంటనే అమ్మకపు ధరలో 25% (ఇఎండీ మొత్తం మినహాయించి) డిపాజిట్ చేయాలి. కొనుగోలుదారు ఆ విధంగా డిపాజిట్ చేయడంలో విఫలమైతే ఇఎండీ కోసం జమ చేసిన మొత్తం జప్తు చేయబడుతుంది మరియు ఆస్తి తిరిగి విక్రయించబడుతుంది. కొనుగోలు ధర యొక్క మిగిలిన మొత్తాన్ని విక్రయం నిర్ధారించబడిన 15వ రోజున లేదా అంతకు ముందు చెల్లించవలెను. నిర్దేశిత వ్యవధిలో చెల్లింపు చేయనట్లయితే ఇఎండీ కింద డిపాజిట్ చేసిన మొత్తం జప్తు చేయబడుతుంది మరియు ఆస్తి తిరిగి విక్రయించబడుతుంది. ఏదైనా ఇతర చట్టబద్ధమైన బకాయిలు / పన్నులు / స్టాంప్ డ్యూటీ / రిజిస్ట్రేషన్ ఫీజు / బదిలీ రుసుము కొనుగోలుదారు విడిగా భరించాలి.
4. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 కింద నిర్దేశించబడిన నియమాలు / షరతులకు లోబడి అమ్మకం ఉంటుంది.

సం/-

తేదీ: 23/02/2023 అధీకృత అధికారి

ప్రదేశము : నెల్లూరు డీసీబీ బ్యాంక్ లిమిటెడ్